క్లుప్తంగా

భవిష్యత్ అంతా ఏఐదే



ప్రత్తిపాడు: రానున్న రోజుల్లో ఏఐ రంగంలో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నట్లు ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఏపీఎస్‌సీహెచ్ఈ) చైర్మన్ కె.మధుమూర్తి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కన్సార్టియం కెపాసిటీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ 2025లో భాగంగా శుక్రవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కంపెనీల చైర్మన్లు, డైరెక్టర్లు, సీఈఈవోలు, హెచ్‌ఆర్ హెడ్‌లు, ట్రెనింగ్ అండ్ ఉపాధి కల్పనాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొఫెసర్ కె. మధుమూర్తి, ఉప్‌మిత్‌సింగ్‌లతో కలసి కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ టీసీఎస్ హెడ్ నాగ్ చల్లా మాట్లాడుతూ టెక్నాలజీపై పూర్తిపట్టు ఉన్నవారికే కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వి.అజయ్ కుమార్, నర్రా సురేష్, డి. రామకృష్ణ, చల్లా వివేకానంద, అభిషేక్, ప్రవీణ్ కుమార్, వి.బాలచక్రధర్, సిహెచ్.వంశీకృష్ణ, వై.కిషన్‌చంద్, శైలజ, కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డా.పి.బాబు, డైరెక్టర్ కె.హరిబాబు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ కార్యవర్గం

పెదకాకాని: గుంటూరు తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు నంబూరు చర్చి సంఘకాపరి జి.రత్నశేఖర్ తెలిపారు. విజయవాడ కుద్దూస్ నగర్ బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం గుంటూరు ఫీల్డ్, విజయవాడ ఫీల్డ్ కార్యవర్గ ఎలక్షన్‌కు ఏబీఎఫ్ఎంసీ పులుకూరి సుజయ్, టీబీ సీసీ నాయకులు పి.భాగ్యానంద్, టి.శిఖామణి, ఎం.ప్రసాద్, కె.శేఖర్‌బాబు, చంద్రబాబు నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గుంటూరు బాప్టిస్ట్ ఫీల్డ్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈజీ ప్రకాష్, ఆర్.అశోక్, ఎన్.దానియేలు, ఎం.ఏలియాలను కార్యవర్గంగా నిర్ణయించారు. జనరల్ కౌన్సిల్ మెంబర్లుగా చెరుకూరి రవివర్మను నియమించడం జరిగింది.

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాల తనిఖీ

గుంటూరు రూరల్: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అధికారులు అందించిన వివరాలు.. ప్రతిమ గార్డెన్స్‌కు చెందిన అడపా పవన్‌కుమార్, అడపా శ్రీనివాస్ గృహ అవసరాలకు ఉపయోగించాల్సిన సబ్సిడీ సిలిండర్లను అక్రమ మార్గంలో వివిధ గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ నుంచి సేకరించి అందులో ఉన్న గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్‌లోకి ఫిల్ చేసి వాటిని బ్లాక్ మార్కెట్లో ఎక్కువ రేట్లు అమ్ముతున్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. తనిఖీలలో భాగంగా 22 సిలెండర్లు, 68 కమర్షియల్ సిలెండర్లు, అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న రెండు ఆటోలు సీజ్ చేసినట్లు చెప్పారు. వీరిపై క్రిమినల్ చర్యలు నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

పట్టభద్రులూ బద్ధకస్తులే

- ఓటు హక్కుకు దూరంగా 3,924 మంది
- నియోజకవర్గంలో ఓటు వేసింది 6,370 మందే
- అవగాహన ఉన్నా ఓటు వేసేందుకు అనాసక్తి



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్తిపాడులోని పోలింగ్ కేంద్రంలో క్యూలైనులో నిలబడిన పట్టభద్రులు (ఫైల్)

ప్రత్తిపాడు: ఓటు మన హక్కు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకున్న బలం అనిర్వచనీయం. నేతల రాతను మారుస్తుంది. మన బతుకుల బాగుకు అడుగులు వేసే నాయకుడిని ఎన్నుకునేందుకు దోహదపడుతుంది. అంతటి విలువైన ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఎంతో మంది అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. సాధారణ ఎన్నికల్లో ఓటుపై కనీస అవగాహన లేని, నడవలేని వారు ఓటు వేయాలని, చూపుడువేలిపై ఓటు ముద్ర పడాలనీ పొద్దుపొద్దున్నే పోలింగ్ కేంద్రాలకు పరుగులు పెడుతుంటారు. కానీ ఓటు హక్కు గురించి పుస్తకాల్లో పుటాలకు పుటాలు చదివిన కొందరు పట్టభద్రులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరించారు. తమకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోకుండా అలసత్వాన్ని చాటారు. అందుకు నిదర్శనమే గురువారం నిర్వహించిన కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నిక. ఈ ఎన్నికల్లో వేల మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా బద్ధకాన్ని ప్రదర్శించారు.

సుమారు నాలుగు వేల మంది దూరంగా..

ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు ఈస్ట్, వెస్ట్ మండలాల్లో కలిపి మొత్తం 10,294 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. వారిలో 6,370 మంది పట్టభద్రులు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. 61.88 శాతం మంది మాత్రమే ఓటు వేశారు. అంటే సుమారుగా 3,924 మంది పట్టభద్రులు ఓటు హక్కుకు దూరంగా ఉన్నారన్నమాట. డిగ్రీలకు డిగ్రీలు, పీజీలు, డాక్టరేట్లు చేసి ఉన్నత చదువులు చదువుకున్న పట్టభద్రులు సైతం ఇలా ఓటు హక్కుకు దూరంగా ఉండటం ప్రజాస్వామ్యవ్యవస్థకు మంచిది కాదని పలువురు పెదవి విరుస్తున్నారు. తమ ఓటు ద్వారా సరైన నాయకుడిని ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే తమ భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల ఉద్యోగ భద్రత, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, సమస్యలపై చట్ట సభల్లో గళమెత్తే అవకాశం ఉంటుందన్న విషయాన్ని గ్రాడ్యుయేట్లు విస్మరించడం బాధాకరం.

మండలాల వారీగా ఓటు హక్కు వినియోగించుకోని పట్టభద్రుల వివరాలు..

మండలం	మొత్తం ఓటర్లు	దూరంగా ఉన్న వారు
ప్రత్తిపాడు	1320	376
పెదనందిపాడు	1603	533
వట్టిచెరుకూరు	1146	408
కాకుమాను	1076	340
గుంటూరు వెస్ట్	2319	1101
గుంటూరు ఈస్ట్	2830	1166
మొత్తం	10294	3924

విజ్ఞాన శాస్త్రం నూతన మార్గాలను సృష్టిస్తోంది

ప్రముఖ శాస్త్రవేత్త సోమశేఖర్ రెడ్డి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

చేబ్రోలు: విజ్ఞాన శాస్త్రం మన జీవితాన్ని ప్రతి మూలలో ప్రభావితం చేస్తోందని.... వైద్యం నుంచి సమాచార సాంకేతికత వరకు, జీవన శైలిలో నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు నూతన మార్గాలను సృష్టిస్తోందని హైదరాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ మెటీరియల్స్ టెస్టింగ్ గ్రూప్ హెడ్, సైంటిస్ట్ సోమశేఖర్ రెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో నేషనల్ సైన్స్ డే సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 'సైన్స్ ఇన్ 21 ఫస్ట్ సెంచురీ: రీడిఫైనింగ్ ద హారిజన్స్ ఆఫ్ ఫ్యూచర్' అనే ఇతివృత్తంపై సదస్సు నిర్వహించారు. ఎఫ్‌కే సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 21వ శతాబ్దం శాస్త్ర సాంకేతికతల విప్లవంతో కొత్త రూపాన్ని సంతరించుకుందన్నారు. చంద్రయాన్, మార్స్ మిషన్, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వంటి ప్రయోగాలతో మానవ జాతి కొత్త ప్రపంచాలను అన్వేషిస్తోందన్నారు. జెనోమిక్స్, రోబోటిక్ సర్జరీ, కృత్రిమ అవయవాలు, వ్యాక్సిన్లు, నూతన మందులు వంటి అభివృద్ధులతో మనిషి జీవన కాలం పెరుగుతోందని వెల్లడించారు. డ్రోన్ వ్యవసాయం రైతుల కష్టాన్ని తగ్గిస్తూ, అధిక దిగుబడికి దోహదపడుతోందని వివరించారు. ఇప్పటివరకు మనం చూసింది కేవలం ట్రెయిలర్ మాత్రమేనని, అసలైన సైన్స్ సినిమాకి మరింత గ్రాండ్ క్లైమాక్స్ ఉంటుందని అభిప్రాయపడ్డారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు, మెమొంటోలు అందజేశారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుని ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ జె పురుషోత్తంకార్తీక్‌కు తమిళనాడుకు చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుని కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డీవీవీ కృష్ణప్రసాద్ అభినందించారు.

సమాజానికి మహిళా శక్తిని చాటిచెప్పాలి

- ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీఓ సుజాతదేవి
- నేటి నుంచి వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు

ప్రత్తిపాడు: మహిళా శక్తిని, స్త్రీ విశిష్టతను సమాజానికి చాటి చెప్పాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని(మార్చి 8) పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఎనిమిదో తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శుక్రవారం తెలిపారు. తొలిరోజు ఆడపిల్లల పుట్టినరోజు వేడుక, ఆడపిల్లల పేరుతో మొక్కలు నాటించడం, 3వ తేదీన బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ, 4న పోషకాహారంపై అవగాహన, చిరుధాన్యాల వినియోగం, ఉపయోగాలపై అవగాహన, 5న కిశోర బాలికలకు వృత్తి విద్య నైపుణ్యాలపై అవగాహన, 6వ తేదీన మహిళలకు ఆర్థిక చేయూత, మహిళా అక్షరాస్యత, 7వ తేదీన మహిళల హక్కులు, పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన, 8న మహిళా హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన కార్యక్రమాలను ఆయా మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నామని సీడీపీఓ వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అలసత్వం వహించకుండా తప్పనిసరిగా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం సహకరించాలి



ర్యాలీలో పాల్గొన్న టైలర్లు

పొన్నూరు: పట్టణంలో టైలరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ తోటమ్మతల్లి ఆలయం సమీపంలోని టైలరింగ్ వర్కర్స్ యూనియన్ పతాకాన్ని యూనియన్ మాజీ అధ్యక్షురాలు బందారు ఉమామహేశ్వరి ఆవిష్కరించారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మాకాని సుధాకర్ అధ్యక్షత వహించారు. ఉమామహేశ్వరి మాట్లాడుతూ టైలర్ల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని, వయసుతో సంబంధం లేకుండా పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఉమామహేశ్వరిని ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ సుభాని, కరిముల్లా, రియాజ్, వెంకట్రావు, వహీద్, మల్లికార్జునరావు, స్వామి, రవి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు పాల్గొన్నారు.

టైలర్స్‌కు ఉపాధి అవకాశాలు కల్పించాలి

చేబ్రోలు: రెడీమేడ్ రాకతో ఉపాధి కోల్పోతున్న టైలర్స్‌కి ప్రభుత్వ పాఠశాలలు, హాస్పిటల్స్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగాలలో యూనిఫాం వంటి పనులు టైలర్స్‌కి ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని టైలర్స్ అసోసియేషన్ చేబ్రోలు మండల అధ్యక్షుడు షేక్ గోరే అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో శుక్రవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు షేక్ గోరేతో పాటు షేక్ యూసఫ్, సుబాని, బాషా, రసూల్, సిలార్, రహంతున్నీసా పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



నారాకోడూరులో..



అక్షయ విద్యార్థులు ప్రదర్శిస్తున్న సైన్స్ ప్రాజెక్టులు



సైన్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

పొన్నూరు: విద్యార్థుల్లో ఆలోచనలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని ఎస్ఎస్‌టీ స్కూల్ డైరెక్టర్ కొలపర్తి శివ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సాయినగర్‌లోని స్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. శాస్త్రవేత్త సి.వి. రామన్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను తెలుసుకుని వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకుసాగాలని అన్నారు. సైన్స్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెలనాటి రామదాసు పాల్గొన్నారు.

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి హెచ్ఎం ఎం.ఏడుకొండలు, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన హరిక, కె.ప్రణతిలను అభినందించారు.

సెయింట్ ఆన్స్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ప్రాక్టికల్ స్కిల్స్, అప్టిక్స్ మెకానిక్స్, విద్యుత్ పవర్, తదితర అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య మాట్లాడుతూ వర్క్‌షాపుల వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారి ఉన్నతికి తోడ్పడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రామారావు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో మానవ మనుగడ

గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఎగ్జిబిషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. పాఠశాల హెచ్ఎం సరోజిని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయకుమారి, వల్లీరాజు, చంద్రమౌళి, ధర్మరాజు, విజయకుమారి, షాలిని, శ్రీనివాస్, అరుణ, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

ప్రత్తిపాడు: విద్యార్థులు చదువుతో శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ రాణించాలని అక్షయ విద్యాలయం చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి అన్నారు. జస్థానిక అక్షయ విద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. విద్యార్థులు వినూత్నంగా రకరకాల ప్రాజెక్టులు, ఆవిష్కరణలను ప్రయోగాత్మకంగా చేసి ప్రదర్శించారు.



వర్క్‌షాపులో ప్రతిభ చూపిన విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

వ్యవసాయ, అనుబంధ రంగాలలో 8.80 శాతం వృద్ధి రేటు



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, అనుబంధ రంగాలలో 8.80 శాతం కాంపౌండెడ్ వార్షిక వృద్ధి రేటు(సీఏజీఆర్) సాధించడం ప్రశంసనీయమని ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐఐ) అడ్వైజర్ రామ్ కౌండిన్య పేర్కొన్నారు. ఈ విజయానికి బయోటెక్నాలజీ అనుసంధానం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెరగడం కారణమని ఆయన విశ్లేషించారు. గుంటూరు నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వర్క్ షాపులో జన్యుపరమైన ఇంజినీరింగ్, మాలిక్యులర్ బ్రీడింగ్, బయోటెక్నాలజీ నూతన ఆవిష్కరణలపై పరిశోధకులు, నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు చర్చించారు. కార్యక్రమాన్ని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఏఎన్జీఆర్ఏయూ), లాం, గుంటూరు, బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ (బీసీఐఎల్), న్యూఢిల్లీ సంయుక్తంగా ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐఐ) మద్దతుతో నిర్వహించారు. లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు ఆహారాన్ని అందించేందుకు మారుతున్న వాతావరణం, పరిస్థితులు, బయోటిక్, ఏ బయోటిక్, ఒత్తిళ్లను తట్టుకునే నూతన రకాలను అభివృద్ధి చేయటం జన్యుమార్పిడి ద్వారానే సాధ్యమని తెలిపారు. ఇటీవల విడుదల చేసిన బయోఫోర్టిఫైడ్ ఇంద్రావతి రాణి రకం దానికి ఉదాహరణ అని తెలిపారు. ఎంటీయూ 1232 అనేది బయోటెక్నాలజీ ప్రభావానికి నిదర్శనమన్నారు. యూనివర్సిటీ బయోటెక్ సాధనాలతో విత్తన జాతుల అభివృద్ధిలో ముందుందన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా సలహాదారులు, ఏజీవీఏవైఏ సహా వ్యవస్థాపకుడు రామ్ కౌండిన్య మాట్లాడుతూ వ్యవసాయ సమస్యలను పరిష్కరించేందుకు బయోటెక్నాలజీ కీలకమన్నారు. బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహుజా మాట్లాడుతూ బీటీ పత్తి విజయం, రైతులకు కలిగిన ప్రయోజనాలు వివరించారు.

సాంకేతికతో నీటి సమస్యలకు పరిష్కారం

ప్రత్తిపాడు: సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామ స్థాయిలో నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వాటర్ ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సురేష్ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీవోఏలకు, డ్వాక్రా మహిళల (నీటి నాణ్యత నిర్వహణ సభ్యులు)కు నీటి నాణ్యత నిర్వహణకు సంబంధించిన సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి నుంచి విశ్వంజీ జన్మదిన వేడుకలు



ప్రత్తిపాడు: మండలం చినకోండ్రుపాడులోని విశ్వనగర్‌లో శనివారం నుంచి మార్చి 5వ తేదీ వరకు విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. విశ్వనగర్‌లో ధర్మపురి వేద పండితులు బొజ్జా రమేష్ శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, అరుణ, మహాసౌర, శ్రీనారాయణ, చండీ పారాయణం, చతుర్వేద హవనములు, జ్యోతిర్లింగార్చనలు, రుద్రాభిషేకాలు, 108 కలశాలతో విశ్వకుండలిని శ్రీనివాస సుబ్రహ్మణ్య స్వామికి, కల్పవృక్ష వరసిద్ధి వినాయకుడికి అభిషేకాలు నిర్వహించనున్నారు. 5వ తేదీన విశ్వంజీ జన్మదినాన్ని విశ్వశాంతి సమైక్యతా దినోత్సవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమాలకు ఆధ్యాత్మిక అతిథిగా శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమంకు చెందిన కె.ఈశ్వర్, ఏపీ మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ అవినీతి నిరోధకశాఖ ప్రిన్సిపల్ చీఫ్ లీగల్ అడ్వైజర్ పీవీకే రమణప్రసాద్, తెలంగాణ ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్‌జోషితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు తెలిపారు.

ఆధునిక సాంకేతికతతో ఫార్మసీ రంగంలో పెను మార్పులు



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలో చలపతి ఫార్మసీ కళాశాలలో కళాశాల పూర్వ విద్యార్థి సంఘం, కళాశాల ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌ఫార్మింగ్ ఐడియాస్ ఇన్ టూ రియాలిటీ, పయనీరింగ్ ఇన్నోవేషన్ ఫర్ హెల్ అనేఅంశంపై ఐడియాథాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మలినేని పెరుమాళ్ళు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు టెక్నాలజీ పై అధిక శ్రద్ధ చూపించాలన్నారు. ఆప్టిక్ థర్డ్ ఐ సొల్యూషన్స్ వ్యవస్థాపక సీఈఓ జె.సంతోష్ మాట్లాడుతూ ప్రపంచం వేగంగా మారిపోతున్న ఈ కాలంలో సృజనాత్మకత, నూతన ఆలోచనలు మన సామాజిక ఆర్థిక అభివృద్ధికి చాలా అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, ఏఎన్‌యూ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రమీలరాణి పాల్గొన్నారు.